క్లుప్తంగా

నేడు నాగ ప్రతిష్ట

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లపల్లి పంచాయతీ కొత్తపల్లిలో ఆదివారం నాగ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. శనివారం గ్రామస్తులు మాట్లాడుతూ రెండు రోజుల పాటు వివిధ పూజలు, అభిషేకాలు, అన్నదానంతో పాటు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

ఎంపీడీఓ కార్యాలయం ఏఓగా రాజేశ్వరి



పీలేరు రూరల్ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ)గా బి. రాజేశ్వరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏఓగా పని చేస్తున్న సతీష్ చిన్నగొట్టిగల్లుకు బదిలీ అయ్యారు. మూడు నెలలు ఏవో పోస్టు ఖాళీగా ఉంది. పుంగనూరులో ఏఓగా పని చేస్తున్న రాజేశ్వరి బదిలీపై పీలేరుకు వచ్చారు. శనివారం బాధ్యతలు స్వీకరించారు.

లీడ్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న చేతన్‌విఖ్యాత్

పీలేరు : న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్టాత్మక లీడ్ చాంపియన్ షిప్‌లో 2024 జాతీయ స్థాయిలో స్థానిక వీఎస్ఎన్ సిద్ధార్థ పాఠశాల నాలుగో తరగతి విద్యార్థి చేతన్‌విఖ్యాత్ ప్రతిభ చూపి ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ వి. మాధవి తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 2 లక్షల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న లీడ్ చాంపియన్‌షిప్‌లో తమ పాఠశాల విద్యార్థి ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. ఈ విజయం తమ పాఠశాల స్మార్ట్ కిడ్జ్ విద్యా ప్రమాణాలకు అద్దం పడుతోందన్నారు. అలాగే ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

పీలేరు : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని చదువులో రాణించాలని ఎంఈవోలు పి. లోకేశ్వర్‌రెడ్డి, బి. పద్మావతి అన్నారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని భువన విద్యాలయం 16వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో చిన్మయమిషన్ స్వామి కృష్ణానంద, పాఠశాల ఛైర్మన్ ఉమారమాదేవి, ప్రిన్సిపాల్ లక్ష్మీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనువిందుగా రాజగోపుర ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో రాజగోపుర ప్రతిష్ట మహోత్సవాలు కనువిందుగా సాగుతున్నాయి. శనివారం ఆగమ సలహాదారు శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు క్రిష్ణప్రసాద్‌భట్టార్, రమేష్ బాబు, క్రిష్ణంరాజు, ధనుష్‌లు సంప్రదాయబద్ధంగా వేదమంత్రోచ్చారణలతో చతుష్టార్చన, మధ్యాహ్నం కర్మదస్తపనం, సాయంత్రం చతుష్టార్చన ఘనదివసం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ మునిబాలకుమార్, ఇన్‌స్పెక్టర్ దుష్యంత్‌కుమార్, ఆలయ సిబ్బంది నగేష్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

మదనపల్లె : పట్టణ రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జన్మదినం సందర్భంగా పుంగనూరు రోడ్డులోని బీసీ, ఎస్సీ హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థినులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. శనివారం అన్నమయ్య జిల్లా రేషన్‌డీలర్ల సంక్షేమసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మౌలాలి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎగ్జామ్ రైటింగ్ ప్యాడ్, నోట్‌బుక్స్, పెన్నులు అందించారు. పరీక్షలపై ఎలాంటి భయాందోళనలు లేకుండా చక్కగా చదువుకుని, పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు.

అందమైన రాత.. మారుస్తుంది భవిత



- గుండ్రని అక్షరాలతో ఎక్కువ మార్కులు
- 10 విద్యార్థులకు నిపుణుల సూచనలు



చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ : ఏడాది పాటు కష్టపడి చదివినా పరీక్ష రాసే రెండున్నర గంటలపైనే ఫలితం ఆధారపడి ఉంటుంది. చక్కనిరాత విద్యార్థుల సొంతమైతే జవాబు పత్రం దిద్దేవారిని ముత్యాల్లాంటి అక్షరాలే తొలుత ఆకర్షిస్తాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇటీవల నిర్వహించిన అంతర్గత పరీక్షల్లో కొందరు ఎక్కువగా కొట్టివేతలు, గజిబిజి రాతతో మార్కుల పోటీలో వెనుకపడ్డారని తెలిపారు. మార్చి 17 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. మదనపల్లె అర్బన్, రూరల్ మండల పరిధిలో 18 ఉన్నత పాఠశాలు ఉన్నాయి. ఇందులో బాలురు 779 మంది, బాలికలు 886 మంది హాజరుకానున్నారు. చేతిరాతపై దృష్టి సారిస్తే మెరుగైన ఫలితాలు సాధించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇదీ పరిస్థితి:

విద్యార్థులు పరీక్షల్లో నాలుగు రకాల తప్పులు చేస్తున్నారని నిపుణులు గుర్తించారు. మార్కులకు తగినట్లు సమాధానాలు రాయలేకపోవడం, వ్యాకరణ, అక్షరదోషాలు, చేతిరాత గజిబిజిగా ఉండటం, ఇందులో ఎక్కువగా మార్కులను గండికొట్టేది చేతిరాతేనని స్పష్టం చేస్తున్నారు. సమాధానాలు రాసేటప్పుడు విరామ చిహ్నాలు మరచిపోవడం తదితర తప్పులు చేస్తుండటంతో మార్కులు కోతపడే అవకాశం ఉంది.

ఉచిత శిక్షణ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేతిరాతపై విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

పాయింట్ల రూపంలో రాయాలి



సమాధానాలు పాయింట్ల రూపంలో రాస్తే మార్కులు బాగా వస్తాయి. పేజీకి 18 నుంచి 20 లైన్లు రాయాలి. అర్థవంతమైన పదాలను విడగొట్టకుండా జాగ్రత్తపడాలి. లేకుంటే దాని అర్థం పూర్తిగా మారిపోయే ప్రమాదం ఉంది. కొట్టివేతలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగా రాయాలి. ఇలా చేయడంతో గత ఏడాది మా పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులు కూడా మంచి మార్కులు తెచ్చుకున్నారు.

– మహమ్మద్‌ఖాన్, చేతిరాత నిపుణులు, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

హోరాహోరీగా బాలికల ఫుట్‌బాల్ పోటీలు



ఫుట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఖేల్ ఇండియా అస్మిత్ ఫుట్‌బాల్ బాలికల పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. లీగ్ పోటీల్లోల మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాల, కన్నెమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల మధ్య జరగగా 1-1, శ్రీవేద స్కూలు, వశిష్ట స్కూలు మధ్య జరిగిన పోటీల్లో 2-2, సీటిఎం జెడ్పీ ఉన్నత పాఠశాల, చెంబకూరు ఉన్నత పాఠశాల మధ్య జరిగిన పోటీల్లో 0-0తో డ్రా ముగిశాయి. ఆదివారం వశిష్ట, శ్రీవేద పాఠశాలలో పోటీలు జరుగుతాయని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్ తెలిపారు. కార్యక్రమంలో క్రీడాభారతి కార్యదర్శి నరేష్‌బాబు, ఫుట్‌బాల్ అసోసియేషన్ నాయకులు కమలేష్, వెంకటేశ్వరప్రసాద్, పీడీలు శివశంకర్, దేవకమ్మ,లత, ఖాదర్‌బాషా, అంజనప్ప, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

తరిగొండ ఆలయంలో విశేష పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని పలు రకాల రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్నే రవాణాశాఖ అధికారి అశోక్‌ప్రతాప్

మదనపల్లె సిటీ : రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని రవాణాశాఖ అధికారి ఎ.అశోక్‌ప్రతాప్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో 36వ రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. విద్య జీవితంలో క్రమశిక్షణ నేర్పిస్తే ఆ క్రమశిక్షణతో రోడ్డు నియమాలు పాటించినప్పుడు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ టి.శివలింగయ్య రోడ్డు ప్రమాదాలు మానవతప్పిదాలని, సెల్‌ఫోన్ వాడుతూ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్,మితిమీరిన వేగాల వలనే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. వాటిని అరికట్టడం మన చేతుల్లోనే ఉందన్నారు. ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కారులో ప్రయాణించేటప్పుడు సీటుబెల్టు మర్చిపోకూడదని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణవేణి రోడ్డుభద్రతను సామాజిక బాధ్యతగాద యువత గుర్తించి నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు సూర్యశేఖర్‌రెడ్డి, మోహన్‌వల్లి, విష్ణుప్రియ, హజీరా, జ్యోతి,వనజ, ఖాజావల్లి తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



బాలికల హాస్టల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న బీసీ సంక్షేమ జిల్లా అధికారి సురేష్‌బాబు

మదనపల్లె సిటీ : పదో తరగతిలో సంక్షేమ వసతి గృహ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి కె.సురేష్‌బాబు అన్నారు. శనివారం సాయంత్రం మదనపల్లె పట్టణంలోని బాలికలు,బాలుర కాలేజీ వసతి గృహాలు, నక్కలదిన్నెలోని బీసీ బాలుర హాస్టలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు సూచనలు,సలహాలు అందజేశారు. పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు, భోజనంను పరిశీలించారు. ఆయన వెంట బీసీ హాస్టల్ వార్డన్ వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.

ఈనెల 7న 'లక్ష డప్పులు–వేల గొంతులు'



కలికిరిలో డప్పు చాటింపు వేస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నేతలు

కలికిరి : ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు–వేల గొంతులు కార్యక్రమానికి మాదిగలు పెద్ద ఎత్తున విచ్చేసి విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామక్రిష్ణమాదిగ, పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండికోట వెంకటేష్ మాదిగలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలికిరిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు డప్పు కళాకారులతో డప్పు చాటింపు వేశారు. మాదిగ, మాదిగ ఉపకులాలవైపు ప్రపంచం చూసేలా మందక్రిష్ణ మాదిగ చేశారని, ఆయన లక్ష్యం నెరవేరడానికి, మాదిగల అభ్యున్నతికి ప్రతి మాదిగ బిడ్డ హైదరాబాద్‌కు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నేతలు గురుప్రసాద్, రాంబాబు, హరిబాబు, విశ్వనాథ,మహేష్, శ్రీనివాసులు, వెంకటరమణ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన సీఐ, ఎస్‌ఐలకు వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలకు వచ్చిన సీఐ రమేష్‌నాయుడు

మదనపల్లె : లారీ ఓనర్ వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన రూరల్ సీఐ రమేష్ నాయుడు, ఎస్ఐ వెంకటసుబ్బయ్యలకు శనివారం జిల్లా ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించారు. యాక్సిడెంట్ కేసులో పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీని విడుదల చేసేందుకు సీఐ, ఎస్ఐలు రూ.70వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే. రెండురోజుల పాటు పట్టుబడిన సీఐ, ఎస్ఐలను విచారించిన ఏసీబీ అధికారులు, నెల్లూరు ఏసీబీ ప్రత్యేక కోర్టుకు తరలించే నిమిత్తం జిల్లా ఆస్పత్రిలో వైద్యపరీక్షలకు తీసుకువచ్చారు.

చదువుతో పాటు ఆరోగ్యం అవసరం

సంబేపల్లె : విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం కూడా చాలా అవసరమని వైద్యులు విద్యాధర్, శ్రీనివాసురాజు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, ఇష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలని ఆకాంక్షించారు. పరీక్షల ముందు విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతోపాటు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొంత మందికి పరీక్షలంటే ఫోబియా ఉంటుందని, అలాంటివారికి పరీక్షలపై భయాన్ని తొలగించాల్సిన అవసరం ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులపై ఉందని చెప్పారు.

కూటమి నాయకులవి కక్ష సాధింపు చర్యలు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు

గాలివీడు: కూటమి నాయకులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా ప్రత్యర్థి పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పూలికుంట ఎంపీటీసీ సభ్యుడు గడ్డం చంద్రప్రకాష్‌రెడ్డి, నూలివీడు ఎంపీటీసీ సభ్యుడు కడప అమానుల్లా పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులపై ఉద్దేశపూర్వకంగా అధికారులతో తప్పుడు ఫిర్యాదులు చేయించి కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. ఇటీవల ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ప్రజా సమస్యలపై ఎంపీడీఓ కార్యాలయానికి ప్రజా ప్రతినిధులు వెళితే వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులను జైలుకు పంపలేదా అని ప్రశ్నించారు.

ఎంపీడీఓను బదిలీ చేయాలి

ఎంపీటీసీ సభ్యుడిగా మండల సర్వసభ్య సమావేశంలో తనకు జరిగిన అన్యాయాన్ని సభ దృష్టికి తెచ్చానని చంద్రప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీఓ జవహర్‌బాబు తీరును వ్యతిరేకిస్తూ ఆయనను బదిలీ చేయాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ తీర్మానాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు. అధికారపార్టీ నేతలు ఎంపీడీఓను అడ్డం పెట్టుకొని కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని, వీరి ఆగడాలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. అధికారం శాశ్వతం కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారి నియమనిబంధనల ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందామన్నారు. తమకు నైతిక విలువలు ఉన్నాయి కాబట్టే.. ప్రజా ప్రతినిధులుగా కొనసాగుతున్నామన్నారు. కూటమి నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని నీటి సంఘం ఎన్నికలను ఏకగ్రీవం చేసుకున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల మంజూరు కోసం స్థానిక టీడీపీ ప్రజా ప్రతినిధులు తమ పార్టీ నాయకులను చుట్టూ ప్రదక్షిణలు చేయలేదా అని నిలదీశారు. తాము ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని, కూటమి నాయకులు ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని వారు ప్రకటించారు.

కంచె ఏర్పాటు

పుల్లంపేట: మండలంలోని కృష్ణంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు నారే చలపతి, బాలిపోగు శివకృష్ణ, నారే కృష్ణకుమార్, ఆకేపాటి మురళీ, నారే విశ్వనాథ్ అందించిన రూ. 50 వేలు నగదుతో కంచెను ఏర్పాటు చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీవీ రమణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల సహకారం ఉంటే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయవచ్చన్నారు. అనంతరం దాతలకు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

42 కార్పొరేషన్ రుణాల యూనిట్లు మంజూరు



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశులు

గుర్రంకొండ : మండలానికి 42 కార్పొరేషన్ రుణాల యూనిట్లు మంజూరు అయినట్లు ఎంపీడీఓ వెంకటేశులు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025-26 ఏడాదికి సంబంధించి 31 బీసీ కార్పొరేషన్ యూనిట్లు, ఒకజనరిక్ మందుల దుకాణం యూనిట్, 11 కాపు కార్పొరేషన్ రుణాల యూనిట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఒక్కోయూనిట్ రూ. 2లక్షలు, రూ.3లక్షలు, రూ.5 లక్షలు వరకు ఉన్నాయన్నారు. ప్రతి యూనిట్‌కు 50 శాతం సబ్సిడీ ప్రభుత్వం భరిస్తుందన్నారు. మిగిలిన 50 శాతం బ్యాంకు ద్వారా రుణం పొందాల్సి ఉందన్నారు. కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకొనేవారు 21 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల వయస్సులోపు ఉండాలన్నారు. జనరిక్ మందుల షాపును ఈబీసీలో రెడ్డివర్గానికి రిజర్వు చేశారన్నారు. ఇందుకోసం డీఫార్మసీ, బీఫార్మసీ చదవుకొని నిరుద్యోగిగా ఉంటూ ఎటువంటి మందుల షాపు నిర్వహించకుండా ఉండేవారు అర్హులన్నారు. 21 సంవత్సరాల వయస్సు కలిగి 60 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జనరిక్ మందుల షాపు యూనిట్ రూ. 8 లక్షలు కాగా అందులో 50 శాతం సబ్సిడీ ప్రభుత్వం భరిస్తుందన్నారు. మిగిలిన రూ. 4 లక్షలు బ్యాంకు ద్వారా రుణం పొందాల్సి ఉందన్నారు. ఈనెల 7 తేదీలోగా అర్హులైనవారు ఈ రుణాల కోసం సంబంధిత గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం



ఫీజుపోరు పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, నాయకులు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై ఫీజుపోరు
- ఫిబ్రవరి 5న రాయచోటి కలెక్టరేట్ ఎదుట వైఎస్సార్ సీపీ నిరసన గళం
- పెద్దసంఖ్యలో ప్రజలు తరలిరావాలని వినతి
- పోస్టర్‌లను ఆవిష్కరించిన సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : రాష్ట్రంలోని కూటమిప్రభుత్వం, విద్యాసంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం ఫిబ్రవరి 5న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం విద్యార్థులకు సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం విద్యాసంస్థలకు చెల్లించాల్సిన రూ.3,900 కోట్ల ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను నానా ఇక్కట్లకు గురిచేస్తున్నాయన్నారు. దీన్ని వైఎస్సార్ సీపీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదన్నారు. పిల్లలకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ పోరాడుతుందన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలేసి, వారి భవిష్యత్తుని అంధకారమయం చేస్తున్న కూటమిప్రభుత్వ తీరుకు నిరసనగా జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఫిబ్రవరి 5న ఫీజుపోరు కార్యక్రమాన్ని చేపట్టనున్నామని తెలిపారు. బాధిత విద్యార్థులు, వారి తల్లి దండ్రులతో కలిసి ఫిబ్రవరి 5న రాయచోటి కలెక్టరేట్ ఎదుట నిర్వహించే వైఎస్సార్ సీపీ ఫీజుపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పెద్దసంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరై విద్యార్థులకు బాసటగా నిలుద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాల్‌చంద్రశేఖర్, ఈశ్వర్‌నాయక్, శీలంరమేష్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు పోతబోలు నాగరాజ, డాకరాజుగారి అరవింద్‌తిలక్, జన్నేరాజేంద్ర, వలసపల్లె నాగరాజరెడ్డి, నూర్ మొహియుద్దీన్, మునిశేఖర్, సీరుగట్టుమేరీ, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ అధ్యక్షులు ఎస్.ఏ.కరీముల్లా, కొత్తపల్లె మహేష్, పూజారిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి భోగాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు



నందలూరు: మండలంలోని కుంపిణీపురంలో వెలసిన శ్రీ భోగాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని ఆత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. మంగళవారం ఉదయం స్వామికి అభిషేకం, తదుపరి గరుడసేవ, ప్రసాద వినియోగం రాత్రికి ఆర్కెస్ట్రా, బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆదివారం ఉదయం రథోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు డాక్టర్ గణపతి శంకర్, ఆసంబారావు, చంద్రశేఖర్ కోరారు.

బాలికల విద్యతోనే సాంఘిక దురాచారాలు దూరం

లక్కిరెడ్డిపల్లి: బాలికల విద్యతోనే సమాజంలో ఉన్న దురాచారాలు, బాల్య వివాహలు దూరమవుతాయని లక్కిరెడ్డిపల్లి సివిల్ జడ్జి ఫైజున్నీషా పేర్కొన్నారు. శనివారం స్థాని ఏపీ మోడల్ స్కూల్ నందు మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో తొమ్మిది, పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు బాలికలకు విద్య అవసరం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాలికలకు విద్య ఎంతో అవసరమని చెప్పారు. బాలికల చదువుకు పేదరికం అడ్డురాదని, అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.